దోమలను తరిమేద్దాం..


సీతంపేట: కుశిమి పీహెచ్‌సీ పరిధిలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది


గరుగుబిల్లి: కొత్తపల్లిలో నిర్వహించిన ర్యాలీ

సీతంపేట:

'దోమలు తరిమేద్దాం – ప్రాణాలు కాపాడుకుందాం' అని వైద్య సిబ్బంది పిలుపునిచ్చారు. దోమల నివారణ దినం సందర్భంగా దోనుబాయి, మర్రిపాడు, కుశిమి పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో సిబ్బంది మంగళవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గరుగుబిల్లిలో...

గరుగుబిల్లి: దోమలను సామూహికంగా నివారించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి కెకె.సాగర్‌వర్మ అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా మండలంలోని కొత్తపల్లిలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు ద్వారా మలేరియా, డెంగీ, చికెన్ గున్యా తదితర వ్యాధులు ప్రబలుతాయన్నారు. ఈ వ్యాధులు నివారణకు ప్రజలకు అవగాహన అవసరం అన్నారు. ఎలాంటి జ్వర లక్షణాలున్నా తక్షణమే ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉదయకుమారి, మలేరియా సబ్ యూనిట్ అధికారి ధనుంజ కుమార్, పకీరునాయుడు, రామకృష్ణ తదితరులున్నారు.

క్లుప్తంగా

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం గ్రామంలోని గడ్డికాలనీకి చెందిన మృతుడు నిమ్మక రామారావు కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ సంఘం సమకూర్చిన రూ.10వేల ఆర్థిక సాయాన్ని సర్పంచ్ బి.గౌరీశంకరరావు మంగళవారం అందజేశారు. ఇటీవల రామారావు పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో మృతి చెందగా వాట్సాప్ గ్రూపు ద్వారా సర్పంచ్ ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక దాతలు విరాళంగా ఇచ్చిన నగదు అందజేసినట్టు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు గుడ్ల హరిప్రసాద్, పాలక ప్రేమానంద్, మన్మథ, ఎం.దొరబాబు పేర్కొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన


హెచ్‌ఐవీ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ యూనిట్ సభ్యులు

వీరఘట్టం: మండలంలోని కడకెల్ల గ్రామంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ యూనిట్ బృందం మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఐవీ ఎలా వ్యాపిస్తుంది.. సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది లక్ష్మణ, రాంప్రసాద్, బి.అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

సీతంపేట: మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.గీతాంజలి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం జిల్లా కేంద్రంలోని గిరిజన సామాజిక భవనంలో బుధవారం ఉదయం 10 గంటలకు గిరిజన సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాను. గిరిజన సంస్థల్లో ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలన్న ప్రధాన డిమాండ్ సాధన కోసం కార్యాచరణ రూపొందించడం కోసం ఈ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. గిరిజన సంఘాలకు చెందిన నాయకులు, ప్రతినిధులంతా హాజరవ్వాలని కోరారు.

భామిని ఎంపీడీఓగా చంద్రరావు

భామిని: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా గుడ్ల చంద్రరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ ఎన్నికలకు ముందు బదిలీపై అనకాపల్లి వెళ్లిన చంద్రరావు తిరిగి భామిని వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సీబీఎస్ఈ విద్యార్థులకు ట్యాబ్ బేస్డ్ పరీక్షలు


ట్యాబ్ బేస్డ్ పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈఓ

సీతానగరం: మండలంలోని జోగింపేట కేజీబీవీ విద్యాలయంలో టెన్త్ (సీబీఎస్ఈ) విద్యార్థులకు మేథ్స్ సబ్జెక్ట్‌పై ట్యాబ్ బేస్డ్ పరీక్ష నిర్వహించినట్టు ఎంఈఓ జి.సూరిదేముడు తెలిపారు. జోగింపేట కేజీబీవీలో ప్రిన్సిపాల్ జె.సంధ్య ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు నిర్వహించిన సీబీఎస్‌సీ బేస్డ్ పరీక్షల కేంద్రాన్ని ఎంఈఓ మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షలు రాయడం వలన భవిష్యత్‌లో పోటీ పరీక్షల్లో పాల్గొనే వారికి సెంట్రల్ సిలబస్‌పై ఒక అవగాహన కలుగుతుందన్నారు. విద్యార్థుల్లో విజ్ఞానం, పోటీ పరీక్ష ల్లో పాల్గొనే విధానంపై అవగాహన కల్పించినట్టు తెలిపారు. కేజీబీవీ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశోధన ఫలితాలు రైతులకు అందాలి : కలెక్టర్

పార్వతీపురం: వ్యవసాయ పరిశోధన ఫలితాలను రైతులకు చేరవేసినప్పుడే రైతుల ఆదాయం మెరు గు పడేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఉద్యాన, పౌల్ట్రీ, న్యూట్రీషన్ తదితర అంశాలలో చేస్తున్న పరిశోధనల గూర్చి శాస్త్రవేత్తలు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడు తూ జిల్లాలోని వాతావరణానికి అనువుగా ఉండే నూతన వంగడాలను అందించడంతో పాటు అవగాహనను రైతులకు కల్పించాలన్నారు. జిల్లాలో పైనాపిల్, పసుపు ప్రోసెసింగ్ యూనిట్లు స్థాపనకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. మన బడి – మన తోట కార్యక్రమం ద్వారా జిల్లాలోని అన్ని పాఠశాలలు, వసతిగృహాల్లో ఆకుకూరలు, కాయగూరలు పండించేందుకు అవసరమైన విత్తనాలను అందించాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, జిల్లా వ్యవసా య అధికారి రాబర్ట్‌పాల్, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేట ర్ ధృవ, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

వసతిగృహాల పరిశీలన


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాఠశాలలో విద్యార్థుల భోజనం పరిశీలిస్తున్న బృందం సభ్యులు

కొమరాడ: మండలంలోని కేజీబీవీ పాఠశాల, గిరిజన సంక్షేమ పాఠశాల(బాలురు), డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాఠశాల(బాలికలు)లకు సంబంధించి వసతిగృహాలను ఉప తహసీల్దార్ శివయ్యతో పాటు ఎంపీడీఓ కార్యాలయ బృందం మంగళవారం పరిశీలించింది.

ఈ సందర్భంగా ఆయా చోట్ల మెనూ అమలు, నాణ్యత, తాగునీరు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. వారి వెంట ఎస్ఐ నీలకంఠం, వీఆర్ఓ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న గ్రంథాలయ సంస్థ సెక్రటరీ కుమార్‌రాజు

సీతంపేట: స్థానిక శాఖా గ్రంథాలయాన్ని ఆ సంస్థ సెక్రటరీ బి.కుమార్‌రాజు మంగళవారం తనిఖీ చేశారు. ముఖ్యమైన పుస్తకాలు ఎన్ని ఉన్నాయి.. ఇంకా ఏయే పుస్తకాలు అవసరమో, తదితర వివరాలపై ఆరా తీశారు. నిరుద్యోగులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని లైబ్రేరియన్ బబ్బురు గణేష్‌కు సూచించారు. గ్రంథాలయానికి రహదారి సౌకర్యం లేని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

టీకాలతో గాలికుంటు వ్యాధి నివారణ

- పశుసంవర్ధక శాఖ జె.డి శివ్వాల మన్మథరావు


పశువులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

పాలకొండ రూరల్: ప్రస్తుత సీజన్‌లో విజృంభించే గాలికుంటు వ్యాధి నుంచి పాడిపశువులకు రక్షణ కల్పించేందుకు టీకాలు తప్పనిసరిగా వేయాలని పశుసంవర్ధక శాఖ జె.డి శివ్వాల మన్మథరావు అన్నారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మండలంలోని కొండాపురంలో సామూహిక టీకా కార్యక్రమం చేపట్టారు. ఈమేరకు గ్రామంలోని పశువుల ఆస్పత్రి వద్ద మంగళవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. 170 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఎ.డి ప్రభామాణిక్యరావు, సర్పంచ్ రాయి వనజ, వైద్యులు సిద్ధార్థ, తదితరులు పాల్గొన్నారు.

'పొలంబడి'లో బడి పిల్లలు


మొక్కలు నాటుతున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి బాలుర వసతిగృహం విద్యార్థులకు ఎనీటైం మోడల్‌లో భాగంగా ఆకుకూరలు, కాయగూరలు తదితర అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ అసోసియేట్ జి.అన్నపూర్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని అన్నారు. చిన్నప్పటి నుండి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో ఎనీటైం మోడల్ (ఏటీఎం)లో బంతి తీగజాతులు, దుంపజాతులు వేసుకోవడం వలన పిల్లలకు పని అనుభవంతో పాటు నేర్చుకున్న ప్రకృతి వ్యవసాయం పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌డబ్ల్యూఓ కె.శంకరరావు, పీఈటీ రాజశేఖర్, పాఠశాల సిబ్బంది విద్యాసాగరరావు, యూనిట్ ఇన్‌చార్జ్ కె.రామకృష్ణ పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై సమాచారం ఇవ్వండి

- పాలకొండ డీఎస్పీ కృష్ణారావు


ద్విచక్ర వాహనాలకు వేలం పాట నిర్వహిస్తున్న పాలకొండ డీఎస్పీ కృష్ణారావు

గుమ్మలక్ష్మీపురం: గంజాయి, నార్కోటిక్ డ్రగ్స్ మరియు సైకోట్రోపిక్ పదార్థాల రవాణా, అమ్మకాలపై ప్రజలు తమకు సమాచారం అందివ్వాలని పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు పిలుపునిచ్చారు. మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో మంగళవారం వివిధ సారా కేసుల్లో పట్టుబడిన 8 ద్విచక్ర వాహనాల వేలం పాట కార్యక్రమంలో డీఎస్పీ పాల్గొన్నారు. అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పాలకొండ డివిజన్లో గంజాయి, ఎన్‌డీపీఎస్ రవాణా జరుగకుండా నిఘా ఉంచామన్నారు. అందులో భాగంగానే బత్తిలి, ఎల్విన్‌పేట వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, 24/7 పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా గంజాయి రవాణా చేసినా.. అమ్ముతున్నట్లు తెలిసినా యువత, భావితరాల జీవితాలు రక్షించేందుకు తక్షణమే తమకు సమాచారం అందివ్వాలని కోరారు. అనకాపల్లిలో జరిగిన ఘటన నేపథ్యంలో డివిజన్లో అనుమతులు లేని వసతిగృహాలు, సంరక్షణ గృహాలు ఎక్కడైనా ఉన్నాయేమో క్షుణ్ణంగా పరిశీలించి గుర్తించాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలకు సూచించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట సీఐ పి.సత్యనారాయణ, ఎల్విన్‌పేట, మొండెంఖల్లు ఎస్ఐలు బి.శివప్రసాద్, నీలకంఠం పాల్గొన్నారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాల్సిందే..

- సీఐటీయూ నాయకుల డిమాండ్


మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న సీఐటీయూ, పలు సంఘాల నాయకులు, మహిళలు

పాలకొండ రూరల్: కోల్‌కతాలో వైద్య విద్యార్థిని అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన బాధ్యులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సంఘ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు నేతృత్వంలో అంగన్‌వాడీలు, ఆశా, హెల్త్ వర్కర్లు మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ.. హత్యాచార సంఘటనను దేశమంతా ముక్తకంఠంతో ఖండిస్తోందన్నారు. దర్యాప్తు వేగవంతం చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎస్.హిమప్రభ, బి.అమరవేణి, శారద, జి.జెస్సీబాయి, కాద రాము, తదితరులున్నారు.

పశువులకు టీకాలు


పశువులకు టీకాలు వేస్తున్న నిర్వహిస్తున్న పశువైద్యాధికారిణి శైలజ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని గుమ్మ గ్రామంలో 150 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు మంగళవారం వేసినట్టు పశు వైద్యాధికారిణి కె.శైలజ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈసీజన్‌లో పశువుల ఆరోగ్యంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పశువుల శాలలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యాధుల బారిన పడకుండా టీకాలు వేయించాలని కోరారు. పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఏజెన్సీల అరాచకాలకు అడ్డుకట్ట వేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కుమార్

పార్వతీపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వ వైద్య సంస్థలైన వైద్య కళాశాలలు, బోధనాస్పత్రులు, జిల్లా ఆస్పత్రులు, ప్రాంతీయ ఆస్పత్రులు, సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రాల్లో పారిశుద్ధ్యం, భద్రత, చెద పురుగుల నివారణ, సూపర్‌వైజర్లను నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఏజెన్సీల అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ డిమాండ్ చేశారు. పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది, సూపర్‌వైజర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రిలో ఉన్న శానిటేషన్, సెక్యూరిటీ, చెద పురుగుల నివార ణ సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలు చెల్లించక పోవడంతో ప్రశ్నిస్తే ఒక నెల జీతం మాత్రమే ఇచ్చారన్నారు. వారికి సంబంధించిన పీఎఫ్ డబ్బుల జమలో కూడా తేడాలు ఉన్నాయన్నారు. సమావేశంలో ఆ సంఘం మన్యం జిల్లా అధ్యక్షుడు సింహాద్రి దుర్గారావు, కార్యవర్గ సభ్యుడు అలజంగి కుమారమ్మ, సెక్యూరిటీ, శానిటేషన్ సూపర్‌వైజర్లు సంచా న శంకరరావు, ఎం.చంద్రమౌళి, బాలకృష్ణ, కావ్య తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

పార్వతీపురం టౌన్: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని పార్వతీపురం టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రాజు అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల లో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు.

రాయితీపై యంత్ర పరికరాలు

పాలకొండ రూరల్: వ్యవసాయ, ఉద్యానవన, ఇతర పంటలు సాగు చేస్తున్న రైతులకు డ్రిప్, స్పింక్లర్లను రాయితీపై అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని ఉద్యానవన శాఖాధికారి తమ్మినేని అమరేశ్వరి అన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ఆసక్తి గల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూమికి సంబంధించిన సమగ్ర సమాచారంతో పాటు ఆధార్, వన్‌బీ, రేషన్ కార్డు లేదా ఓటరు ఐడీ కార్డు, బ్యాంక్ అకౌంట్, ఎఫ్ఎంబీ మ్యాప్, తదితర నకళ్లు జతచేసి రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు 79950 09843, 79950 09841 నంబర్లను సంప్రదించాలన్నారు.

పాఠశాలల సందర్శన

సీతంపేట: స్థానిక కేజీబీవీ, మినీ గురుకుల పాఠశాలలను జీసీడీఓ రాములమ్మ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా బాలికల డార్మిటరీ, తరగతి గదులను పరిశీలించారు. అలాగే విద్యార్థుల మెనూపై ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సిబ్బందిని ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు.

'ఓపెన్' విద్యను సద్వినియోగం చేసుకోవాలి


సార్వత్రిక విద్యా పీఠం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: కొన్ని కారణాల వల్ల చదువుకు దూరమైన వారంతా దూర విద్యా విధానం ద్వారా చదువును మళ్లీ కొనసాగించాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సూచించారు. సార్వత్రిక విద్యా పీఠం పోస్టర్లను ఆమె మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా టెన్త్, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని, చదువు మానేసిన వారంటే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ ఎం.సుధాకర్, ప్రతినిధులు సీహెచ్ శ్రీనివాసరావు, డి.సురేష్, ఎ.రాజు, కె.సన్యాసిరావు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


ఎంపీడీఓ ఉమామహేశ్వరికి అభినందనలు తెలియజేస్తున్న సహచర సిబ్బంది

పాలకొండ రూరల్: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జె.ఉమామహేశ్వరి ముంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తాజా సార్వత్రిక ఎన్నికల ముందు పాలకొండ నుంచి అనకాపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లిన ఉమామహేశ్వరి తిరిగి పాత స్థానానికే బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఈనెల 24న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభంకానున్న సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

వసతిగృహాల్లో తనిఖీలు


గంగమ్మపేట ఆశ్రమ పాఠశాలలో తనిఖీలు చేస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ, ఎంఈఓ

వీరఘట్టం: అనకాపల్లి జిల్లా కైలాసపట్నంలోని అనాథాశ్రమంలో ఫుడ్ పాయిజన్ వల్ల నలుగురు విద్యార్థులు మృతి చెందడంతో పార్వతీపురం మన్యం జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ హాస్టల్స్, గిరిజన, ఎస్సీ వసతిగృహాల్లో మంగళవారం ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. విద్యార్థులకు వండిపెడతున్న వంటకాలు, బియ్యం, పప్పులు, కూరగాయలు, గుడ్లు, తదితర నిత్యావసర సరకులతో పాటు వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వీరఘట్టం మండలంలోని కేజీబీవీతో పాటు గంగమ్మపేట గిరిజన ఆశ్రమ పాఠశాలను తహసీల్దార్ చందక సత్యనారాయణ, ఎంఈఓలు ఆర్.ఆనందరావు, ఆర్.లక్ష్మున్నాయుడు తనిఖీలు చేశారు. వేడి ఆహార పదార్థాలను విద్యార్థులకు వండి పెట్టాలని సూచించారు.

సక్రమంగా మెనూ ..


ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఏపీఓ చిన్నబాబు

సీతంపేట:

మెనూ సక్రమంగా అమలు చేయాలని ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు అన్నారు. మండలంలోని బుడగరాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను మంగళవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. పాఠశాల వాతావరణం పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు.

రక్తదాన శిబిరానికి స్పందన


రక్తదానం చేస్తున్న దాత

పాలకొండ: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆవరణలో ఏపీ ఎన్‌జీఓ సంఘం, రెవెన్యూ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చింది. డీఎస్పీ కృష్ణారావు, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఎన్‌జీఓ సంఘ నాయకుడు హనుమంతు సాయిరామ్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 84 మంది దాతల నుంచి రక్తం సేకరించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్‌బాబు, ఎన్‌జీఓ సంఘ గౌరవాధ్యక్షుడు లిల్లీపుష్పనాథం, పార్వతీపురం మన్యం జిల్లా ఎన్‌జీఓ సంఘ అధ్యక్షుడు కిశోర్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగభూషణరావు, చిన్నపిల్లల వైద్యుడు రవీంద్రకుమార్, రెడ్‌క్రాస్ ప్రతినిధి చైతన్యకుమార్, ఎన్‌జీఓ సంఘ నాయకులు జానకీరామ్, రంగాచారి, ఈశ్వరరావు పాల్గొన్నారు.

చెత్తను తొలగించండి..


ఆందోళన చేస్తున్న రమణారావు, తదితరులు

పాలకొండ : ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న చెత్తను వెంటనే తొలగించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్యాలయం ఎదురుగా డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. నిత్యం రద్దీగా ఉండే మార్కెట్ సమీపంలో చెత్తను వేస్తున్నారని, దీంతో మార్కెట్‌కు వచ్చిన వారు దుర్గంధం భరించలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆందోళనలో పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ


రస్తా కుంటుబాయి కేవీకేలో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలం రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో 'గిరిజన ప్రాంతంలోని అటవీ ఉత్పత్తులకు అదనపు విలువ' అనే అంశంపై గిరిజన మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు వారం రోజులుగా ఇస్తున్న శిక్షణ మంగళవారం ముగిసింది. గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాలకు చెందిన వారికి శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కేవీకే హోంసైన్స్ శాస్త్రవేత్త ఉమజ్యోతి మాట్లాడుతూ అటవీ ఉత్పత్తులైన చింతపండు, ములక్కాడలు, బొప్పాయి తదితర ఉత్పత్తులతో పచ్చళ్లు, కేక్‌లు, లాలీపప్‌లు ఇతర తినుబండారాల వంటి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ పొందిన మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. శాస్త్రవేత్తలు ఎస్.స్రవంతి, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.